క్లుప్తంగా

అమృతకు ప్రశంసాపత్రం అందించిన జేసీ



ఏలూరులో విజేత సిరిశెట్టి అమృతకు సర్టిఫికెట్ అందిస్తున్న జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి

నిడమర్రు: అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో నిర్వహించిన వక్తృత్వం పోటీల్లో ద్వితీయ స్థానం విజేతగా నిలిచిన పత్తేపురం జెడ్పీస్కూల్ 9వ తరగతి విద్యార్థిని సిరిశెట్టి అమృత లక్ష్మిసాయికి శుక్రవారం ఏలూరులో నిర్వహించిన బాలికా దినోత్సవం వేడుకల్లో జేసీ ధాత్రి రెడ్డి ప్రశంసాత్రాన్ని అందించారు. గైడ్ టీచర్ సుబ్బరాజు, హెచ్ఎం సత్యనారాయణలు ఉన్నారు.

కైకరం హైస్కూలు విద్యార్థినికి సత్కారం



నెరుసు సుమలతను సత్కరిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి, అధికారులు

ఉంగుటూరు: బాలికలు దినోత్సవం సందర్భంగా ఏలూరు మహిళా ప్రాంగణంలో స్త్రీ శిశు సంక్షేమ, మహిళా అభివృద్ధి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కైకరం హైస్కూలు విద్యార్థిని నెరుసు సుమలతను జేసీ ధాత్రిరెడ్డి, ఎస్పీ ప్రతాప్‌కిషోర్ సత్కరించారు. సుమలత సిద్ధం చేసిన ప్రాజెక్టు జాతీయస్థాయికి ఎంపికైందని హెచ్ఎం ప్రసాదరావు, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు కునాతి జాన్ తెలిపారు.

ఎంఎస్ఎంఈ పథకంలో అర్హులకు రుణాలు

దెందులూరు: మండలంలో ప్రభుత్వ లక్ష్యాల అనుగుణంగా మహిళా సంఘాల నిర్వహణ, ఆర్థికాభివృద్ధి, సంక్షేమం, ప్రభుత్వ పథకాల అమలుకు ఎంఎస్ఎంఈ పథకం ద్వారా ప్రణాళిక రూపొందించా మని దెందులూరు మండల ఏపీఎం సురేష్ అన్నా రు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో సురేష్ మాట్లాడుతూ మహిళా సంఘాల గ్రూపు సభ్యులు యూనిట్ ఏర్పాటు చేసుకుంటే వాటి అభివృద్ధికి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రుణం పొందే అవకాశం ఉందన్నారు. ఈ పథకాన్ని డ్వాక్రా సంఘాలు ఉపయోగించుకోవాలన్నారు.

ఆర్థిక సమస్యలతో ప్రజలు సతమతం

- చేసేందుకు పని లేదు.. చేతిలో చిల్లిగవ్వ లేదు
- అభద్రతాభావంలో పేద, మధ్యతరగతి కుటుంబాలు
- అమలు కాని సూపర్‌సిక్స్ హామీలు
- వైఎస్సార్‌సీపీ హయాంలో పేదలను ఆదుకున్న పథకాలు

ఏలూరు రూరల్ : పేద, మధ్యతరగతి ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో సతమతవుతున్నారు. పండుగలు వస్తున్నా వారికి ఆదాయం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. దసరా వచ్చింది.. త్వరలో దీపావళి, తదితర పండుగలు వరుసగా రానున్నాయి. ఇంట్లో భార్యా, పిల్లలు బట్టలు, టపాసులు కొనాలంటున్నారు. చేసేందుకు పని లేదు. చేతిలో చిల్లిగవ్వ లేక పేద మధ్య తరగతి ప్రజలు దిక్కులు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఒక్క పథకమైనా అమలు చేయడం లేదని వారు గగ్గోలు పెడుతున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో సాఫీగా సాగే జీవితాన్ని ఇరకాటంలో నెట్టుకున్నామని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఐదేళ్లా క్రమం తప్పకుండా సంక్షేమ పథకాలు అమలయ్యేవి దీంతో లబ్ధిదారుల చేతుల్లో నగదు ఉండేది. పండుగల వేళ పథకం సొమ్ము ఖర్చులకు ఉపయోగపడేది. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందని ప్రజలంతా గుర్తు చేసుకుంటున్నారు. ఇంటి అవసరాల కోసం చేతిలో సొమ్ము లేక నానా అగచాట్లు పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు



అమలు కాని సూపర్ సిక్స్

ఎన్నికల్లో గెలిస్తే సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తామంటూ పగల్బాలు పలికిన కూటమి నాయకుల అనంతరం వాటిని విస్మరించారు. ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు దాటినప్పటికీ 19 ఏళ్ల పైబడిన మహిళలు అందరికీ నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18,000 వేలు అందిస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ అమలు కాలేదు. ఈ పథకంపై పేదలు అనేక ఆశలు పెట్టుకున్నారు. ఇంటిలో ఎంతమంది మహిళలు ఉంటే అంతమందికీ పథకం అమలు చేస్తానని చంద్రబాబు ఎన్నికల్లో చేసిన ప్రకటన పేదలపై ప్రభావం చూపింది. తల్లి, కుమార్తె ఉన్న ఇంటికి నెలకు రూ.3వేలు వస్తుందని ఆశపడ్డారు. ఈ మొత్తంతో ఇంటి అవసరాలు తీర్చుకోవచ్చని అనుకున్నారు. పేదల ఆశలు నేటికీ కూటమి ప్రభుత్వం నెరవేర్చడం లేదు. కనీసం సూపర్ సిక్స్ పేరుతో ప్రకటించిన ఏడాదికి 3 గ్యాస్ బండలు ఫ్రీ, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం పథకాలైనా అమలు చేయకపోవడంతో ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం గూడుకట్టుకుంటోంది.

పేదలను ఆదుకున్న చేయూత పథకం

దెందులూరు నియోజకవర్గం, ఏలూరు రూరల్ మండలంలో 3,020 మంది పేద కుటుంబాలకు గత ప్రభుత్వం వైఎస్సార్ చేయూత పథకం అమలు చేసింది. ఈ పథకం ద్వారా 2019 నుంచి 2023 వరకూ ఏడాదికి రూ.18 వేల చొప్పున మొత్తంగా రూ.14,64,26,250 అందించింది. చాటపర్రులో 398 మందికి రూ.2,78,25,000, గుడివాకలంకలో 456 మందికి రూ.1,55,62,500, మొండికోడు గ్రామంలో 29 మందికి రూ.17,43,750, జాలిపూడిలో 226 మందికి 1,22,81,250, కాట్లంపూడిలో 53 మందికి రూ.30 లక్షలు, కోటేశ్వరదుర్గాపురంలో 345 మందికి రూ.63,82,500, కోమటిలంకలో 90 మందికి రూ.31,31,250, మాదేపల్లిలో 321 మందికి రూ.1,38,56,250. మల్కాపురంలో 182 మందికి రూ.97,31,250, పెదయాగనమిల్లిలో 43 మందికి రూ.22,12,500, పైడిచింతపాడులో 182 మందికి రూ.85,31,250, కొక్కిరాయిలంకలో 23 మందికి రూ.10,68,750, ప్రత్తికోళ్లలంకలో 301 మందికి రూ.2,13,93,750, శ్రీపర్రులో 296 మందికి రూ.1.50 లక్షలు, కలకుర్రులో 75 మందికి రూ.47,06,250 అందించారు. ఈ పథకంతో పాటు వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ, అమ్మ ఒడి తదితర పథకాలు పేదలు ఆర్థికంగా ఎదిగేలా సహకరించాయి. కరోనా సమస్యతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారినప్పటికీ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 2019 నుంచి 2023 వరకూ నవరత్నాలు అమలు చేసి అందరి మన్ననలు అందుకున్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి



కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పేరుతో ఎన్నికల్లో గెలిచింది. ఇప్పుడు ప్రభుత్వం 100 రోజుల పాలనపై ప్రచారం చేసుకుంటున్నారు. సూపర్ సిక్స్‌లోని అమ్మ వందనం, ప్రతి మహిళలకు నెలకు రూ.1,500 ఆర్థిక సాయంపై ఒక్క ప్రకటన లేదు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళలు అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, చేయూత పథకాల ద్వారా ఎంతో లబ్ధి పొందారు.

– తంగెళ్ల రాము, 15 డివిజన్ కార్పొరేటర్

గతంలో ఆదుకున్న పథకాలు



సూపర్ సిక్స్ పేరుతో ఎన్నో హామీలిచ్చారు. ఇప్పటి వరకూ ఒక్క పథకం అమలు చేయలేదు. పిల్లలకు ఫీజులు, పెరిగిన ఖర్చులతో కుటుంబ పోషణ కష్టంగా మారుతోంది. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇలా లేదు. వైఎస్సార్ చేయూత పథకం పేదలను ఆదుకుంది. అనేక పేద కుటుంబాలు చిరు వ్యాపారం చేసుకుంటూ సంతోషంగా జీవించాయి. ఇదంతా జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమే. ఆయన చేసిన సాయం ఇప్పుడు పేదలు మళ్లీ గుర్తు చేసుకుంటున్నారు.

– కె కృష్ణవేణి, వెంకటాపురం

నూనె ధరల క్రమబద్ధీకరణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సామాన్యులకు నిత్యావసర వస్తువులు సరసమైన ధరలకు అందుబాటులో ఉంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. శుక్రవారం స్థానిక పత్తేబాద రైతు బజారులో పామాయిల్, సన్ ఫ్లవర్ ఆయిల్ స్పెషల్ కౌంటర్‌ను ఆయన ప్రారంభించారు. సన్ ఫ్లవర్ గోల్డ్ డ్రాప్ ఆయిల్ (910 గ్రా) లీటరు రూ.124, పామ్ ఆయిల్ 850 గ్రాములు ప్రియా గోల్డ్, కుప్పలు, ఫస్ట్ క్లాస్ బ్రాండ్లు రూ.110 రైతు బజారు స్పెషల్ కౌంటర్‌తో కలిపి నగరంలో ఆరు చోట్ల వినియోగదారులకు విక్రయించేందుకు ఏర్పాటు చేశామన్నారు. తెల్లకార్డు గల కుటుంబానికి లీటరు సన్ ఫ్లవర్ ఆయిల్ మూడు ప్యాకెట్లు, 850 గ్రాముల గల పామ్ ఆయిల్ ప్యాకెట్ పొందడానికి అర్హులు అన్నారు. రేషన్‌కార్డు వివరాలు సమర్పించి వీటిని ఆయా ధరలకు పొందవచ్చన్నారు. టమాటాలు కిలో రూ.50, ఉల్లిపాయలు కర్నూలు రకం కిలో రూ.38కు అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌ఓ ఆర్‌ఎస్ రాజు, మర్చంట్ ఛాంబర్ అధ్యక్షులు నేరెళ్ల రాజేంద్ర, నాయకులు బొద్దాని శ్రీనివాస్, నాయుడు సోము, అర్నేపల్లి తిరుపతిరావు పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు



బావిశెట్టివారి పేటలో దుర్గాదేవి



మహిషాసుర మర్దనిగా పవర్‌పేట శ్రీరాజ్యలక్ష్మి



12 పంపుల సెంటర్‌లో కనకదుర్గమ్మకు చీర సారె తీసుకువస్తున్న మహిళలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలో శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. స్థానిక 12 పంపుల సెంటర్‌లో వేంచేసియున్న కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో దసరా మహోత్సవాల్లో భాగంగా ఆలయ మహిళా కమిటీ, కార్య నిర్వాహణాధికారి పి.రీనా మాధురి ఆధ్వర్యంలో ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కందుకూరి రాజా శర్మ ఆలయానికి విచ్చేసిన అశేష భక్తులతో అష్టోత్తర శతనామ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. అంతకు ముందు స్థానిక మహిళలు అమ్మవారికి చీర, సారె, పసుపు, కుంకుమ, గాజులు సమర్పించారు. స్థానిక దక్షిణపు వీధి శ్రీ జలాప హరేశ్వర స్వామి ఆలయంలోని మహిషాసురర్దని అమ్మవారిని నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు దంపతులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. స్థానిక బావిశెట్టివారి పేట కనకదుర్గ అమ్మవారికి దుర్గాదేవి అలంకరణ చేశారు. ఆలయ ఈఓ సీహెచ్. చిననాగేశ్వరరావు కార్యక్రమాలు పర్యవేక్షించారు. స్థానిక పవర్ పేట శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీ వాసుదేవ స్వామి ఆలయంలోని శ్రీ రాజ్య లక్ష్మి అమ్మవారిని మహిషాసుర మర్ధనిగా అలంకరించి విశేష పూజలు చేశారు.

పిల్లల హక్కులు కాపాడాలి

ఏలూరు రూరల్ : బాలబాలికల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఏలూరు రూరల్ తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ చిల్డ్రన్స్‌డే సందర్భంగా చాటపర్రు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామస్తులతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసవర్మ, వీఆర్వో శేషగిరిరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె సత్యనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	రద్దు
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం (ఇంద్ర)	20.15	02
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	01

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	03
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	06
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	00
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	00
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	20
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	98512	34
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.20	98502	30
ఏలూరు - తిరుపతి	16.00	4830	30

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	50-60	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	48	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	52	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	36-50	ములక్కాడలు	07,10
బెండకాయలు	38	కంద	50
పచ్చిమిర్చి	24-28	బీట్‌రూట్	40
కాకర కాయలు	34-44	కీరా దోస	36
బీరకాయలు	48	ఫ్రెంచ్‌బీన్స్	120
బీరకాయలు (పందిరి)	54	అల్లం	70-150
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	40-48	పాలకూర	12
దొండకాయలు	40	చుక్కకూర	12
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	35-55	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	36-40	బఠాణి	--
ఆనబకాయ (1)	30-40	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20-25	చిలకదదుంప	48

రతన్ టాటాకు ఘన నివాళి



ఏలూరులో రతన్ టాటాకు నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): భారత దేశ పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటాకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎంఆర్పీఎస్, ఎంఎస్‌పీ,వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ భారత దేశ పారిశ్రామిక వేత్త, భారతదేశ ముద్దు బిడ్డ, పద్మ విభూషణ్ రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటన్నారు. పారిశ్రామిక రంగంలో శత్రువులు లేని ఏకైన వ్యక్తి ఆయన అని కొనియాడారు. దాతృత్వంలో ఆయన ఆదర్శనీయుడని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఎంఆర్పీఎస్ ఇంచార్జి, మరియు రాష్ట్ర నాయకులు బయ్యారపు రాజేశ్వర రావు మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగాల శేఖర్ మాదిగ, జిల్లా అధ్యక్షుడు నమ్మిన నాగార్జున, కాశీ కృష్ణ మాదిగ ఉమ్మడి జిల్లా కోశాధికారి, నమ్మిన లక్ష్మి కుమారి, రాష్ట్ర నాయకురాలు, ఎంఎస్పీ గౌరవ అధ్యక్షుడు మద్దాల తిరుపతి రావు మాదిగ,మేతర అజయ్ బాబు, జిల్లా మానవత అధ్యక్షుడు, బహుజన నాయకులు కాగితం అచ్యుత్ పూలే గౌడ్, మైక్రో ఆర్టిస్ట్ మేతర సురేష్ కుమార్, మదర్ థెరిస్సా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కందుల సంతోష్ మాదిగ, ఏలూరు నగర్ అధ్యక్షుడు గెద్దాల ప్రసాద్ మాదిగ, దెందులూరు నియోజకవర్గం ఎంఎస్పీ అధ్యక్షుడు చోడిమెళ్ల వీరయ్య మాదిగ, పెదవేగి మండలం అధ్యక్షుడు కోలుకులూరి ఏసు మాదిగ, దుర్గరావు మాదిగ, మామూడురి మహంకాళి పాల్గొన్నారు.

భవానీ మాలధారులకు అల్పాహారం పంపిణీ

దెందులూరు: జాతీయ రహదారిపై దెందులూరు వద్ద కొప్పుల వెలమ సంఘం ఆధ్వర్యంలో భవానీ మాలధారులకు అల్పాహారం శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం సంఘం జిల్లా నాయకులు సంపంగి వేణు గోపాల్ మాట్లాడుతూ దసరా సందర్భంగా కాలినడకన విజయవాడ తదితర అమ్మవారి ఆలయాలకు వెళ్లే భవానీ మాలధారులకు అల్పాహారం అందించడం హర్షణీయమన్నారు. దెందులూరు గ్రామానికి చెందిన కొప్పుల వెలమ సంఘం నాయకులు సంపంగి వేణు గోపాల తిలక్, మెరప చిన్నా, రాజేష్, గోపి, వెంకటేశ్వరరావు తదితరులు ఆధ్వర్యంలో అల్పాహారం, తాగునీరు, మజ్జిగప్యాకెట్లు, భోజనం, పులిహోర, ఇడ్లీ తోపాటు పలు రకాల అల్పాహారాన్ని మాలధారులకు అందించారు.

ఆదర్శ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కండి

భీమడోలు: బాలికలపై హింస సమాజ హేతువు అని, వాటిని నివారించి ఆదర్శ సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని భీమ డోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. ప్రపంచ బాలికా దినోత్సవంను పురస్కరించుకుని శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కి షోర్ బాలికలు, లబ్దిదారులకు బాలికల సంరక్షణ, బాలికల హక్కులు, బాలికల విద్య, బాల్య వివాహాలు గురించి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు ర్యాలీ ప్రదర్శన చేసి మానవహారం చేసారు. బేటీ బచావో, బేటీ పడావో అంటూ నినదించారు. ఆడపిల్లలను రక్షించాలి.. బాల్య వివాహా లను నియంత్రించాలని నినాదాలు చేసారు. అనంతరం నిర్వహించిన సమావేశానికి సూపర్‌వైజర్ ఎండీ షహనాజ్‌బేగం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్‌కుమార్ పాల్గొని ప్రసంగించారు. సూపర్‌వైజర్లు ఎస్‌కే నూర్జహాన్, ఎం.కవిత, వివిధ శాఖల సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చేబ్రోలులో అంగన్‌వాడీ సెంటరులో..

ఉంగుటూరు: బేటి బచావో -బేటీ పడావో కార్యక్రమం ఉంగుటూరు మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించారు. శుక్రవారం బాదంపూడి చేబ్రోలు, కైకరంలో నిర్వహించారు. ఈ సందర్భంలో బాలికలను పరిరక్షించాలనే నినాదాలు చేశారు. గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు ర్యాలీ నిర్వహించారు. బాదంపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచి కంకట పద్మలీల, ఈవోపీఆర్డీలు, హెల్త్ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. కైకరంలో నిర్వహించిన కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మి, ఎంపీడీవో ఆఫీసు సూపరింటెండెంటు ఆంజనేయులు పాల్గొన్నారు.

వంట నూనెల విక్రయ కేంద్రం ప్రారంభం

దెందులూరు: స్థానిక కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయం వద్ద శ్రీ బాలాజీ ట్రేడర్స్ అధినేత సుగ్గిశెట్టి హనుమాన్ ఆధ్వర్యంలో చౌక ధరలకు వంట నూనెలు సరఫరా చేసే కేంద్రాన్ని ప్రారంభించారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ లబ్ధిదారులకు వంట నూనె ప్యాకెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.సుమతి, మండల టీడీపీ అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు), మండల పార్టీ నాయకులు గారపాటి కొండయ్య చౌదరి, సర్పంచ్ తోట ఏసమ్మ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.